

సాగునీటి ప్రాజెక్టులు..

● జిల్లాలో పలు సాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయి. అలాగే చెరువులు, కుంటలకు కొదవ లేదు. ఇవన్నీ పూడికపోయి ఉన్నాయి. కూటమి ప్రభుత్వం పోలవరాన్ని పూర్తిచే యాలన్న సంకల్పంతో ఉంది. ఇది పూర్తయితే పోలవరం ఎడమ కాలువ ద్వారా జిల్లాకు సాగునీరు అందనుంది. తాటిపూడి, రైవాడ, తారకరామ వంటి ప్రాజెక్టుల నుంచి తాగు, సాగు నీరు స్థానికంగా పూర్తిగా వాడుకునేందుకు అనుమతిస్తామని కూటమి ప్రభుత్వం చెబుతుంది. కేంద్ర బడ్జెట్ నుంచి నిధులొస్తేనే కాలువల నిర్మాణం, రిజర్వాయర్లు, చెరువుల్లో పూడిక తీతలకు అవకాశం ఉంటుంది.

నిర్మాలమ్మా కరుణించేనా?



నేడు కేంద్ర బడ్జెట్

- జిల్లాకు నిధుల కేటాయింపుపై ఆశలు
- అధ్వానంగా సాగునీటి వనరులు
- గిరిజన యూనివర్సిటీకి సొంత భవనం కరువు
- పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందేనా?



పరాయి పంచన నడుస్తున్న గిరిజన యూనివర్సిటీ

శృంగవరపుకోట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌పై జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలతో పాటు మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో కేటాయింపులు ఎలా ఉంటాయోనని ఆతృతగా ఎదురుచూస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛ భారత్ మిషన్‌ను అమలు చేస్తున్నారు. అయితే, కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ పథకానికి ఆశించిన స్థాయిలో నిధులు రాకపోవడంతో పంచాయతీలు ఆర్థిక సంఘం, సాధారణ నిధుల నుంచి ఖర్చు చేస్తున్నారు. దీంతో మిగిలిన అభివృద్ధి కుంటుపడుతుంది. అదే విధంగా ఆరోగ్య సంరక్షణ నేషనల్ హెల్త్ పథకం ద్వారా పలు కార్యక్రమాలు జరుగుతున్నాయి. అంటు వ్యాధులు, కుష్టు వ్యాధిపై సర్వే, జాతీయ కీటకాజన వ్యాధులు, మాతృత్వ వందనోజన వంటి ఎన్నో ప్రజా ఆరోగ్యానికి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు స్మార్ట్ సిటీస్, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు డ్రిప్ ఇరిగేషన్, మైక్రో ఇరిగేషన్, రైల్వే కనక్టవిటిని మెరుగుపరిచేందుకు రైల్వే ప్రాజెక్టులు, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, విద్య, ఆరోగ్య, జీవనోపాధి, మౌలిక వసతుల కల్పనకు ట్రైబల్ సబ్‌ప్లాన్, ఎకో టూరిజం, విద్యుత్ సదుపాయం కల్పించేందుకు పీఎంజనమన్, పీఎం సూర్యఘర్ పథకాలను ప్రవేశ పెట్టారు. పీఎం కుసుమ్ పథకం ద్వారా సోలార్ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు స్థల సేకరణలు జరుగుతున్నాయి. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) ద్వారా ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు, చేపల నిల్వకు ఐస్ బాక్స్‌లు, లైవ్ ఫిష్ వెండింగ్ యూనిట్లు, 2లక్షల ఫిష్ కియాస్కులు, వాల్యూ టూడెడ్, ఆక్వాహబ్ నిర్మాణం, ఫింగర్ లింగ్ సైజు చేప పిల్లలు వంటివి అందిస్తున్నారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమలతో వృద్ధి చెందేందుకు పీఎంఈజీపీ పథకం ద్వారా మహిళలు, యువతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి అవకాశాలను మెరుగుపరచడం కోసం నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) అమలు చేస్తున్నారు. అయితే, జిల్లాలో ఈ పథకాలన్నీ ముందుకు సాగాలంటే కేంద్ర బడ్జెట్‌లో నిధులు విడుదల్సిన అవసరం ఉంది. ఇంతవరకు ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ల్లో జిల్లాకు ప్రత్యేకంగా నిధుల కేటాయింపు జరగలేదు. రాష్ట్ర విభజన చట్టంలో వెనుక బడిన ప్రాంతాలు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు. కానీ, నిధుల విడుదల అంతంత మాత్రమే జరుగుతుంది. గత బడ్జెట్‌లో అమరావతికి, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ప్రత్యేకంగా కేటాయించారు. దీంతో వెనుకబడిన జాబితాలో ఉన్న జిల్లాకు ఆ నిధులు వచ్చాయి. అంతేతప్ప ప్రత్యేక కేటాయింపులు లేవు. కేంద్రీయ గిరిజన యూనివర్సిటీకి నిధులు కేటాయిస్తే ప్రత్యేకంగా జిల్లాకు కేటాయించినట్లే. జిల్లాలో అత్యధికంగా పేద, మధ్య తరగతి ప్రజలు ఉన్నారు. దీంతో బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ప్రజలు, ప్రజాప్రతినిధులు భావిస్తున్నారు. శనివారం ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు ఏమేరకు ప్రయోజనం చేకూరుతుందో చూడాలి.

జిల్లాలో పరిస్థితి..

● రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా రాష్ట్రానికి కేంద్ర గిరిజన విశ్వ విద్యాలయం మంజూరైంది. దీన్ని జిల్లాకు కేటాయించారు. అయితే, పదేళ్ల దాటుతున్నా ఈ విశ్వవి ద్యాలయానికి సొంత గూడు లేక పరాయిపంచన నడు స్తోంది. 2019 ఆగస్టు నుంచి తరగతులు జరుగుతున్నా యి. 426 మంది విద్యార్థులు 14 రకాల కోర్సులను అభ్య సిస్తున్నారు. వీరంతా సొంత తరగతి గదుల్లో చదువుకు నేందుకు ఎదురు చూస్తున్నారు. గిరిజన యూనివర్సిటీని రాష్ట్రానికి కేటాయించిన తరువాత కేంద్ర ప్రభుత్వం ఇప్ప టి వరకు ఏడు బడ్జెట్‌లను ప్రవేశ పెట్టింది. శనివారం ఎనిమిదో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు. అయితే, ఇంత వరకు ప్రవేశపెట్టిన బడ్జెట్‌ల్లో యూనివర్సిటీకి ఎంత కేటాయించారో అధికారిక లెక్కలు బయటపడలేదు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూటమి లో టీడీపీ, జనసేన ఉన్నాయి. ఈ బడ్జెట్‌లోనైనా గిరిజన యూనివర్సిటీకి నిధులు కేటాయిస్తారని జిల్లా ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

● జిల్లాలో జీడీపీ గ్రోత్ పెరగాలంటే పరిశ్రమల స్థాపన అవసరం. కేంద్ర ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలను ప్రోత్సహిస్తోంది. దీంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా ఇదే దారిలో నడు స్తోంది. జిల్లాలో బొబ్బిలి గ్రోత్ సెంటర్, ఐడీఏ నెల్లిమర్ల, విజయనగరం, కొంగవానిపాలెం, కొత్తవలస మండలం బలిఘట్టం, రెల్లి, కంటకాపల్లి, కాటికాపల్లి, చినరావుపల్లి, పెదరావుపల్లి తదితర గ్రామాల పరిధిలో భూములను సేకరించి ఉంచారు. శృంగవరపుకోట మండలం కిల్తంపాలెం తో పాటు మరో నాలుగు గ్రామాల పరిధిలో జిందాల్‌కు సేకరించి ఇచ్చిన 1100 ఎకరాల భూముల్లో కూడా ఎంఎస్ ఎంఈ పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమయ్యే ప్రోత్సాహం రాష్ట్ర ప్రభుత్వం అందించేందుకు, కేంద్ర (మిగతా 6వ పేజీలో..)

సచివాలయాల ప్రక్షాళన

- ఉద్యోగుల సర్దుబాటు ● మూడు విభాగాలుగా క్రమబద్ధీకరణ
- సేవలు సరళతరం చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- ఉత్తర్వులు జారీ

కొమరాడ సచివాలయం



విజయనగరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సచివాలయాల సమూల ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం పూనుకుంది. పూర్తిగా ప్రజోపయోగ పనులకు సచివాలయ ఉద్యోగులను వినియోగించాలని భావిస్తోంది. ఉద్యోగుల హేతుబద్ధీకరణతోనే అది సాధ్యమని నమ్మి గ్రామ/వార్డు సచివాలయాలను మూడు విభాగాలుగా (ఏ,బీ,సీ) విభజించనుంది. ఈ మేరకు సచివాలయాల శాఖ ముఖ్యకార్యదర్శి కాటంనేని భాస్కర్ ఉత్తర్వులు జారీచేశారు. 2019 అక్టోబరు 2న వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. గ్రామ/వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. ప్రతి సచివాలయంలో 11 శాఖలకు సంబంధించి సహాయకులను నియమించింది. జిల్లా బోర్డు ఆధ్వర్యంలో నియామకాలు చేపట్టింది. ప్రజలకు స్థానికంగా సేవలందించే పేరిట భారీగా ఉద్యోగులను నియమించింది. అందులో కొందరికి పని తక్కువగా ఉండగా.. మరికొందరిపై విపరీతంగా భారం పడుతోంది. ధ్రువపత్రాల జారీలో డిజిటల్, వెల్ఫేర్ కార్యదర్శులు కీలకంగా వ్యవహరిస్తారు. వీరి సంఖ్య తక్కువగా ఉంది. మరికొన్నిచోట్ల అయితే చాలాశాఖలకు సంబంధించి కార్యదర్శులకు పనిలేకుండా ఉంది. ఉదాహరణకు మత్స్యకారులు లేని సచివాలయాల్లో మత్స్యశాఖకు సంబంధించిన కార్యదర్శులను నియమించారు. వారికి ఎటువంటి పనిలేకుండా పోయింది. అటువంటి ఉద్యోగులను వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి..

ఉమ్మడి జిల్లాలో 778 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం పోస్టులు 6,567 ఉన్నాయి. కానీ 6,181 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇంకా ఉద్యోగుల లోటు ఉంది. చాలాచోట్ల ఎక్కువగాను.. మరికొన్నిచోట్ల తక్కువగాను సిబ్బంది ఉన్నారు. దీంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీంతో సిబ్బంది సర్దుబాటుకు సంబంధించి ప్రభుత్వం హేతుబద్ధీకరణకు దిగింది. పలుచోట్ల సాంకేతిక సహాయకులు లేకపోవడంతో ఆ పనిని వెల్ఫేర్ అసిస్టెంట్లు చేస్తున్నారు. ఉద్యోగుల్లో చాలామంది ఇంజినీరింగ్, డిప్లమో, పీజీ, పీహెచ్‌డీ చేసిన వారు ఉన్నారు. వీరి సేవలను క్షేత్రస్థాయిలో వినియోగించుకోవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల సచివాలయ ఉద్యోగుల పూర్తి వివరాలను సేకరించింది. వారి సీఎంఎఫ్ఎస్ ఐడీ, సెల్‌ఫోన్ నంబరు, విద్యార్హత, కులం, ఉపకులం వివరాలు సేకరించారు. బీటెక్, ఎంటెక్, ఈసీఈ, మెకానికల్, సివిల్, పీజీ, పీహెచ్‌డీ చేసిన వారి సమాచారం తీసుకున్నారు. ఉద్యోగుల రేషన్‌లైజేషన్‌లో ప్రభుత్వం ప్రజా అవసరాల మేరకు వీరి సేవలను వినియోగించుకోనుంది. జిల్లాలోని సచివాలయాల్లో 200 మంది వరకూ ఉన్నత విద్యావంతులు పనిచేస్తున్నట్టు తెలుస్తోంది.

ఏబీసీలుగా విభజన..

సచివాలయ ఉద్యోగులను ఏ,బీ,సీ విభాగాలుగా (మల్టీపర్పస్, టెక్నికల్, ఆస్పిరేషనల్ ఫంక్షనరీలు) విభజించారు. ఆస్పిరేషనల్ ఫంక్షనరీలు క్రియాశీలకంగా వ్యవహరించనున్నారు. ఏ కేటగిరికి సంబంధించి 2,500 జనాభా లోపు ఉండే సచివాలయాల్లో (మిగతా 6వ పేజీలో..)

అందరూ మెచ్చేలా.. పిల్లలకు నచ్చేలా..

- విద్యాశాఖను గాడిలో పెడుతున్న కూటమి ప్రభుత్వం
- సమూల మార్పులకు శ్రీకారం



రాజాం రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అనుసరించిన అస్తవ్యస్త విధానాలతో విద్యావ్యవస్థ దారుణంగా తయారైంది. జగన్ సర్కారు అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య గణనీయంగా తగ్గింది. ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను సమీప హైస్కూళ్లలో కలిపేయడంతో చాలా గ్రామాల్లో పాఠశాలలు మూతపడ్డాయి. దూర ప్రాంతాలకు నడిచి వెళ్లలేక చాలామంది విద్యార్థులు చదువుకు దూరమయ్యారు. ఫలితంగా విద్యాశాఖపై పెను ప్రభావం పడింది. విద్యావ్యవస్థను మళ్లీ గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ప్రభుత్వ విద్యను పటిష్టం చేసేందుకు మంత్రి నారా లోకేశ్ చర్యలు చేపడుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులతో పలుమార్లు చర్చలు జరిపారు. వారి ఆలోచనలు, సలహాలు, సూచనల మేరకు సమూల మార్పులకు శ్రీకారం చుడుతున్నారు.

సంస్కరణలివే..

ప్రాథమికోన్నత పాఠశాలలకు స్వస్తి పలకాలని నిర్ణయించారు. 60 మందికన్నా ఎక్కువ విద్యార్థులు (మిగతా 6వ పేజీలో..)

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

- ప్రభుత్వ కళాశాలల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి: కలెక్టర్ అంబేడ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్

విజయనగరం, కలెక్టరేట్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై శుక్రవారం తన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. శనివారం నైతికత - మానవ విలువలపై, ఈ నెల 3న పర్యావరణంపై పరీక్షలు నిర్వహిస్తారు. ప్రయోగ, థియరీ పరీక్షలతోపాటు ఈ రెండింట్లో పాసైతేనే ఇంటర్మీడియట్ పూర్తి అయినట్టు. 10వ తేదీ నుంచి ప్రయోగ (ప్రాక్టికల్స్) పరీక్షలు ప్రారంభంకానున్నాయని ఆర్ఐవో మజ్జి ఆదినారాయణ తెలిపారు. ప్రయోగ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. ఒకేషనల్ కోర్సు పరీక్షలు 5 నుంచి ప్రారంభ మవుతాయన్నారు. థియరీ పరీక్షలు మార్చి 1 నుంచి జరుగుతాయన్నారు. మొత్తం 41,270 మంది (ఫస్టియర్ 20,902, సెకండియర్ 20,368 మంది) విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. వీరిలో 35,253 మంది సాధారణ, 6017 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారని వివరించారు. 131 పరీక్ష కేంద్రాలు, 793 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీఈవో మాణిక్యం నాయుడు మాట్లాడుతూ.. మార్చి 3 నుంచి 15 వరకూ నిర్వహించే ఓపెన్ స్కూల్ పరీక్షలకు 1,313 మంది విద్యార్థులు హాజరు కానున్నారని చెప్పారు. 7 పరీక్ష కేంద్రాలను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, సమీపంలోని జెరాక్స్ కేంద్రాలను మూసి వేయాలని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ సమావేశంలోని డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఏపీఈడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థినిపై దాడి!

- వసతిగృహం వద్ద అపస్మారకస్థితిలో.. ● ముఖం, చేయిపై కమిలిన గాయాలు
- దాడి నిందితులను అరెస్టు చేయాలని మంత్రి అచ్చెన్న ఆదేశం ● శ్రీకాకుళంలో ఘటన

5 లో

అక్షరం అండగా.. పరిష్కారం దొరికెనుగా..

- ఎమ్మెల్యే, నగరపాలక సంస్థ కమిషనర్ చొరవ
- వివిధ పనులకు కదలిక ● వీధి దీపాలు, తాగునీటి సమస్యలకు మోక్షం

4 లో

రిజిస్ట్రేషన్లకు బారులు

- క్రయ, విక్రయదారులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిట
- నేటి నుంచి భూముల ధర పెరగనుండడమే కారణం


దాసన్నపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దీ

విజయనగరం దాసన్నపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు శుక్రవారం కిటకిటలాడాయి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు శనివారం నుంచి భూముల మార్కెట్ ధరలు పెరగనున్నాయి. ఈ మేరకు కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు అమలులోకి రానున్నాయి. దీంతో శుక్రవారమే భూములను రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు క్రయ, విక్రయదారులతో రావడంతో కార్యాలయాలు రద్దీగా మారాయి. ఉదయం నుంచి రాత్రి వరకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. సాధారణంగా రోజుకి సుమారు 20 నుంచి 30 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు జరుగుతుండేవి. కానీ, శుక్రవారం ఒక్కరోజే ప్రతి కార్యాలయంలో 50 నుంచి 70 వరకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఎస్.కోట, గజపతినగరం, కొత్తవలస, విజయనగరం 1, విజయనగరం 2, బొబ్బిలి, భోగాపురం, నెల్లిమర్ల, తెర్లాం, రాజాం, చీపురుపల్లి కార్యాలయాల్లో మొత్తం 500 నుంచి 700 వరకు డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలిసింది. దీనివల్ల సుమారు రూ.2కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదాయం చేకూరింది.

అక్షరం అండగా.. పరిష్కారం దొరికెనుగా!

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా.. ఆంధ్రజ్యోతి



ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర పేరుకుపోయిన చెత్తాచెదారం



పిచ్చిమొక్కలతో నిండిపోయిన మురుగు కాలువ



'అక్షరం అండగా..' కార్యక్రమం తరువాత ఇలా...



'అక్షరం అండగా..' కార్యక్రమం తరువాత తొలగింపు పనులు

- ఎమ్మెల్యే, నగర పాలక సంస్థ కమిషనర్‌ల చొరవ
- వివిధ పనులకు కదలిక ● వీధి దీపాలు, తాగునీటి సమస్యలకు మోక్షం

విజయనగరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి)

జిల్లా కేంద్రంలోని 43వ డివిజన్ ఉడా కాలనీలో నిర్వహించిన 'అక్షరం అండగా..పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జనవరి 28న 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో స్థానికంగా ఈ కార్యక్రమం నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఇచ్చిన హామీల అమలు దిశగా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అడుగులు వేస్తున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో కమిషనర్ నల్లనయ్య ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. జనవరి 29 నుంచే సమస్యల పరిష్కారానికి నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది చొరవ చూపుతున్నారు. ఇందులో భాగంగా కమిషనర్ ఆదేశాలతో కాలనీలోని మురుగు కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను, పిచ్చిమొక్కలను తొలగించారు. మురుగునీరు సాఫీగా ప్రవహించేందుకు వీలుగా చర్యలు చేపట్టారు. పార్కులో వెలగని వీధి దీపాలను తొలగించి, కొత్త దీపాలను ఏర్పాటు చేశారు. పార్కు ముందు పేరుకుపోయిన చెత్తను తొలగించారు. కాలనీలో నిరుపయోగంగా ఉన్న బోరు బావిని బాగుచేశారు. పార్కులో పిచ్చిమొక్కలను తొలగించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా పార్కుకు ప్రహరీ, ఓపెన్ జిమ్ నిర్మాణం, పార్కులో లైటింగ్ ఏర్పాట్లు చేయలేకపోతున్నామని... మార్చి 3 తరువాత ప్రాధాన్య క్రమంలో పనులను చేపడతామని నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. వార్డులోని వివిధ సమస్యలు పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కాలనీలో బోరుబావిని బాగుచేస్తున్న మెకానిక్



ఉడా కాలనీ పార్కులో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తూ..

సహకార సంఘాల సంవత్సరంగా 2025

- ఏడాది పొడవునా కార్యక్రమాలు ● కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాదిని అంతర్జాతీయ సహకార సంఘాల సంవత్సరంగా పాటించాలని నిర్ణయించినట్టు కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఏడాది పొడవునా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. అన్ని ప్రభుత్వ శాఖలను భాగస్వాములను చేస్తూ ప్రతి నెలా ఒక్కో అంశంపై కార్యక్రమాలు చేపట్టేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని తెలిపారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సహకార బ్యాంకు ద్వారా బ్యాంకింగ్ కార్యకలాపాలు పెంచడంతో పాటు పెద్ద ఎత్తున ఖాతాదారులను చేర్పించేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి, జేసీ సేతుమాధవన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, సీఈవో ఉమామహేశ్వరరావు, జిల్లా సహకార అధికారి రమేష్, వ్యవసాయ శాఖ జేడీ రామారావులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

ప్రతి 15 రోజులకు సమావేశాలు..

'మిషన్ వాత్సల్య' కార్యక్రమంలో భాగంగా బాలల సంక్షేమం, పరిరక్షణ కోసం గ్రామ స్థాయిలో సర్పంచుల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేసి... ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయి కమిటీ చర్చించిన అంశాలను జిల్లా స్థాయి కమిటీకి పంపించాలన్నారు. గ్రామస్థాయిలో పరిష్కారం లభించని వాటిని జిల్లా స్థాయిలో చర్చించి... పరిష్కారం చూపించనున్నట్టు తెలిపారు. బాల్య వివాహాలు చేయాలనే ఆలోచన తల్లిదండ్రులకు రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ రుక్సానా బేగం, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి..

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైనందున ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీ నాయకులు పాటించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. రాజకీయ పార్టీ నాయకులతో తన చాంబర్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ కోడ్ అమలుకు 27 ఎంసీసీ బృందాలు, 27 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పని చేస్తాయని చెప్పారు. జెడ్పీ సీఈవో ఎంసీసీ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. నామినేషన్ వేసిన సమయంలో అభ్యర్థితో పాటు మరో నలుగురు వ్యక్తులు హాజరు కావచ్చని తెలిపారు. రిటర్నింగ్ అధికారికి 100 మీటర్ల దూరం వరకు మూడు వాహనాలను అనుమతించనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్‌డీవో కీర్తి, రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఖలీల్‌బాబుకు చాదర్‌ను అందిస్తున్న సీఎం చంద్రబాబు

బాబాకు చాదర్ సమర్పణ

- ఖలీల్‌బాబుకు అందించిన సీఎం చంద్రబాబు

విజయనగరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విజయనగరం సద్గురు బాబా ఖాదర్ వలీ 66వ చందనోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మకర్త ఖలీల్‌బాబుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పవిత్ర చాదర్‌ను అందజేశారు. బాబాకు సమర్పించాలని కోరారు. విజయనగరం బాబా మెట్టలో గల దర్గాలో ఈ నెలలో జరగనున్న ఉరుసు మహోత్సవాలకు సంబంధించి ధర్మకర్త ఖలీల్‌బాబు.. శుక్రవారం అమరావతిలో సీఎం చంద్రబాబుకు ఆహ్వాన పత్రికను అందించారు. కుల మతాలకు అతీతంగా దేశ, విదేశాల నుంచి బాబా భక్తులు, సూఫీ సిద్ధాంతాలను నమ్మేవారు ఉరుసుకు హాజరవుతారని సీఎంకు వివరించారు. ఏటీకే -వెలుగు వృద్ధాశ్రమంలో ఎంతోమంది వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. దర్గాల్లో నిత్యాన్నదానం చేస్తున్నట్లు వివరించారు. ఈమేరకు సీఎం స్పందిస్తూ.. ఖాదర్‌వలీబాబా ఉరుసు, చందనోత్సవానికి పవిత్ర చాదర్‌ను ఖలీల్‌బాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దర్గా ప్రతినిధులు పాల్గొన్నారు.

రథసప్తమి వేడుకలకు పటిష్ఠ చర్యలు

- రేపటి నుంచి సిక్కోలులో ట్రాఫిక్ ఆంక్షలు ● 4వ తేదీ అర్ధరాత్రి వరకు కొనసాగింపు
- ఉత్సవాల నిర్వహణకు ప్రజలు సహకరించాలి
- కేటాయించిన సమయాల్లోనే భక్తులకు దర్శనం
- శ్రీకాకుళం అదనపు ఎస్పీ కేవీ రమణ

శ్రీకాకుళం క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలో రథసప్తమి వేడుకలకు సంబంధించి భక్తులకు అసౌకర్యం కలుగకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అదనపు ఎస్పీ కె.వి.రమణ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 2, 3, 4 తేదీల్లో జరిగే వేడుకలకు 2,300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజులు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలవుతాయని చెప్పారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి పోలీసులతో సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ నిర్దేశించిన ప్రదేశాల్లో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని చెప్పారు. స్వామివారి దర్శనానికి రూ.300, రూ.500, డోనర్ పాసులు (క్షీరాభిషేకం) ఉన్నవారు తమకు కేటాయించిన సమయంలోనే దర్శనం చేసుకోవాలని సూచించారు. అనంతరం రథసప్తమి వేడుకలకు సంబంధించి ప్రవేశ, బయటకు వచ్చే మార్గాలు, వాహనాల పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు, ఆలయం పూర్తి రూట్ మ్యాప్, క్యూలైన్లు తదితర అంశాలు తెలియజేసే పోస్టర్లను అదనపు ఎస్పీ కె.వి.రమణ, డీఎస్పీ వివేకానంద, ఎస్బీ సీఐ ఇమాన్యుయల్ రాజు, టౌన్ సీఐ పి.పైడపునాయుడు, ట్రాఫిక్ సీఐ నాగరాజుతో కలిసి ఆవిష్కరించారు.

దర్శనానికి వచ్చే మార్గాలు ఇవే..

● నగరంలోకి భక్తులు సింహద్వారం, కిమ్స్ రోడ్డు, డే అండ్ నైట్ జంక్షన్, ఏడురోడ్ల జంక్షన్, పాత బస్టాండు మీదుగా అరసవల్లి మిల్లు జంక్షన్ వద్దకు చేరుకోవాలి. 80 అడుగుల రోడ్డులో, ఎల్.ఎన్.ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాల్లో వాహనాలను పార్కింగ్ చేయాలి.

పార్కింగ్ స్థలాలు..

● 80 అడుగుల రోడ్డులో కేంద్ర మంత్రి నివాసం పక్కన గల ఖాళీ స్థలంలో ఆటోలు, టాటా ఏసీలు, పార్కింగ్ చేసుకోవాలి. అలాగే ఇంటి ఎందురుగా గల ఖాళీ స్థలంలో మోటారు సైకిళ్లు, కార్లు, పార్కింగ్ చేసుకోవాలి.

● బీకేఎస్ కాలేజీ పక్కన కొత్తగా ఏర్పాటు చేసిన రోడ్డు మార్గం ద్వారా కొయ్యాన కన్నయ్య కాలనీలో గల ఎల్.ఎన్.ఫంక్షన్ హాలు ఎదురుగా గల ఖాళీ ప్రదేశంలో కారు పార్కింగ్ చేసుకోవాలి.

● అరసవల్లి మెయిన్ ఆర్చి ఎదురుగా సూర్యతేజ ఫంక్షన్ హాలుకు చెందిన ఖాళీ ప్రదేశంలో వీవీఐపీల వాహనాల పార్కింగ్ ఉంటుంది.

● వాడాడ జంక్షన్ వద్ద అసిరితల్లి ఆలయం సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో కార్లు, మోటారు సైకిళ్లకు పార్కింగ్ చేసుకోవచ్చు.

● ఖాజీపేట మీదుగా వచ్చే వాహనాలకు అరసవల్లి మున్సిపల్ హైస్కూల్ పక్కన గల ఖాళీ స్థలంలో పార్కింగ్‌కు కేటాయించారు.



రథసప్తమి రూట్ మ్యాప్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

● కొత్తరోడ్డు నుంచి వచ్చేవారు బలగ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్, డే అండ్ నైట్, ఏడురోడ్ల కూడలి, పాత బస్టాండు మీదుగా మిల్లు జంక్షన్‌కు చేరుకుని పైన తెలిపిన ప్రదేశాల్లో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి.

● పెద్దపాడు మీదుగా రామలక్ష్మణ కూడలి, సూర్యమహల్ జంక్షన్, చిన్నబరాటం వీధి, పాత బస్టాండు మీదుగా 80 అడుగుల రోడ్డులోకి వచ్చేవారు కేటాయించిన స్థలంలో పార్కింగ్ చేయాలి.

● నవభారత్ మీదుగా వచ్చేవారు గుజరాతీపేట, ఏడురోడ్ల కూడలి, పాతబస్టాండు మీదుగా మిల్లు జంక్షన్‌కు చేరుకుని.. 80 అడుగుల రోడ్డులో పార్కింగ్ చేసుకోవాలి.

● గార, శ్రీకూర్మం మీదుగా వచ్చే భక్తులు వాడాడ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ప్రదేశంలో తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి.

● టెక్కలి, నరసన్నపేట వైపు నుంచి వచ్చే భక్తులు అంపోలు అండర్ బ్రిడ్జి సర్వీసు రోడ్డులో ప్రవేశించి, జైలురోడ్డు మీదుగా, అడవరం గ్రామం దాటి అంపోలు మీదుగా గార రోడ్డు చేరుకుని వాడాడ జంక్షన్ వద్ద వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి.

దర్శనానంతరం బయటకు వెళ్లే మార్గాలు..

దర్శనానంతరం భక్తులు తాము వాహనాలను పార్క్ చేసిన చోటుకు వెళ్లి 80 అడుగుల రోడ్డు నుంచి వాంబే కాలనీ జంక్షన్, పొన్నాడ బ్రిడ్జి జంక్షన్, సంతోషిమాత ఆలయం, జెడ్పీ మీదుగా పాతబస్టాండుకు చేరుకోవాలి. అక్కడి నుంచి ఏడురోడ్ల కూడలి మీదుగా నవభారత్ జంక్షన్ మీదుగా హైవేకు చేరుకుంటారు. అలాగే టెక్కలి, నరసన్నపేట మార్గంలో వెళ్లే భక్తులు వాడాడ జంక్షన్ మీదుగా వప్పంగి, సానివాడ, శాస్త్రులపేట మీదుగా చెట్టువానిపేట గ్రామం వద్ద రహదారిపైకి చేరుకోవాలి.

ట్రాఫిక్ ఆంక్షలు..

● 2వ తేదీ (ఆదివారం) ఉదయం 7 గంటలకు 80 అడుగుల రోడ్డులో ఐదువేల మందితో సూర్యనమస్కారాల కార్యక్రమం నిర్వహిస్తారు. దీనికోసం వాహనాల పార్కింగ్ కోసం అదే రోడ్డులో స్థలాన్ని కేటాయించారు. ఆ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు అమలవుతాయి. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు జరిగే స్వామివారి శోభాయాత్ర సమయంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలవుతాయి.

● 3వ తేదీన (సోమవారం) సాయంత్రం ఆర్ట్స్ కాలేజీ మైదానంలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల సమయంలో కూడా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు ఉంటాయి.

ఆభరణాలు ధరించవద్దు..

స్వామివారి దర్శనానికి వచ్చే మహిళలు ఆభరణాలు ధరించి రావద్దని ఏఎస్పీ కె.వి.రమణ సూచించారు. పార్కింగ్ స్థలాల కోసం సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వాటి సాయంతో కేటాయించిన పార్కింగ్ స్థలాలకు చేరుకోవాలని ఆయన సూచించారు.

నేడు దాతలకు పాసుల జారీ..

అరసవల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకలకు సంబంధించి లక్షకు పైగా విరాళాలు అందజేసిన దాతలకు శనివారం పాసులు జారీ చేయనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి రాత్రి 8.30 వరకు పాసులు జారీ చేయనున్నట్టు ఆలయ ఈవో వై.భద్రాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాతలు తమ పాసులు తీసుకునే సమయంలో విరాళాల రశీదులు, పాసుల కోసం చేసుకున్న రిజిస్ట్రేషన్ కాపీలను తీసుకురావాలని ఆయన సూచించారు.



శ్రీకాకుళంలో ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ

వైభవంగా రామాలయ ప్రతిష్ఠ

బొబ్బిలి రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మెట్టవలస గ్రామంలో కొత్తగా నిర్మించిన రామాలయ ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విగ్రహాలు, కల్పవృక్షం, కలశాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. సీతారాముల విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా జైశ్రీరామ్ అనే నినాదాలతో గ్రామం మార్మోగింది. శనివారం నిత్య పూజలు నిర్వహిస్తామని, ఆదివారం కల్పవృక్ష ప్రతిష్ఠ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సోమవారం అన్నప్రసాద వితరణ చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.



కలశ యాత్రలో పాల్గొన్న భక్తులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

కలెక్టర్‌ను కలిసిన సూర్యనారాయణ

విజయనగరం కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ శుక్రవారం కలెక్టర్ అంబేడ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలెక్టరేట్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉద్యోగులు సంఘం సమావేశాల కోసం ఏదైనా భవనాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యోగులుఉన్నారు.

ఐసీడీఎస్ పీడీ రుక్సాన్ బేగం

విజయనగరం కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ పీడీగా రుక్సాన్ బేగం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కలెక్టర్ అంబేడ్కర్‌ను మర్యాదపూర్వకంగా ఆమె కలిశారు. గుంటూరు నుంచి ఆమె పదోన్నతిపై జిల్లాకు వచ్చారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

మెరకముడిదాం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో మెరకముడిదాం పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం పోలీసు, రెవెన్యూ అధికారులతో కలిసి చీపురుపల్లి ఆర్డీవో జి.వి.సత్యవాణి పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘన చర్యలపై దృష్టి సారించాలని తహసీల్దార్ అజూరఫీ జాన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో బుధరాయివలస ఎస్‌ఐ జె.లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

●నెల్లిమర్ల: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ బి.సుదర్శనరావు శుక్రవారం పరిశీలించారు. సదుపాయాలపై ఆరా తీశారు. ఆయనతో పాటు ఎన్నికల విభాగం డీటీ జగన్నాథరావు, వీఆర్వో రెడ్డి గోవింద్, ఏఎస్‌ఐ రమణమూర్తి ఉన్నారు.

●లక్కవరపుకోట: ఎమ్మెల్సీ ఎన్నిక నిమిత్తం మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ టి.రమేష్ శుక్రవారం పరిశీలించారు. ఏఎస్‌ఐ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి సర్వేయర్‌తో కలిసి కేంద్రాన్ని పరిశీలించి ఓటర్లకు సదుపాయాలపై స్థానిక హెచ్‌ఎంతో చర్చించారు.

కూటమిపై విమర్శలు తగవు

గజపతినగరం, జనవరి31:(ఆంధ్రజ్యోతి): అధికారం చేపట్టిన ఏడు నెలల్లో అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు కోరాడ భాస్కర్‌నాయుడు, చప్పా చంద్రశేఖర్, కోరాడ కృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య చంద్రబాబును విమర్శించడం తగదన్నారు. సమావేశంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, మాజీ ఎంపీపీ జి.శ్రీదేవి, ప్రదీప్‌కుమార్ ఉన్నారు.

జాతీయ స్థాయి వర్క్‌షాప్ ప్రారంభం



మాట్లాడుతున్న కెవిఎల్ఎన్ రాజు

విజయనగరం రింగ్‌రోడ్డు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మహారాజా కళాశాలలో శనివారం గణితశాస్త్రంలో నూతనపోకడలు అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్ ప్రారంభమైంది. మహారాజా కళాశాల, బెంగళూరుకు చెందిన ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సౌజన్యంతో వర్క్‌షాప్‌ను రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. వర్క్‌షాప్‌లో తొలిరోజు సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, మాన్సాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కేవీఎల్ రాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాంబశివరావు, గణితశాస్త్ర విభాగాధిపతి ఎస్.సూరిబాబు, చెన్నై మేథమెటికల్ ఇన్‌స్టిట్యూట్ సైన్స్ ప్రొఫెసర్లు డిశంత్ పాంచోలీ, మనోజ్, బి.వి.రావు తదితరులు హాజరయ్యారు.

జగన్ వైఫల్యంతోనే ఆర్థిక సంక్షోభం

●మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, జనవరి31:(ఆంధ్రజ్యోతి): జగన్ అవలంబించిన విధానాల వల్లే రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం నెలకొందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంల నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క చాన్స్ అంటూ అధికారం చేపట్టిన జగన్.. కూటమి ప్రభుత్వానికి రూ.11 లక్షల కోట్లు అప్పు అప్పగించారన్నారు. ఇందుకు ఏటా రూ.70వేల కోట్లు వడ్డీ చెల్లించాల్సి వస్తోందన్నారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రతిపక్షం విషం చిమ్మడం దారుణమన్నారు. ఏడు నెలల వ్యవధిలో కూటమి ప్రభుత్వం ఉచిత వంటగ్యాస్, పింఛన్ల పెంపు అమలు చేసిందన్నారు. తల్లికి వందనం, రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. జగన్ మూడు రాజధానుల పేరుతో రాజధానిని నిర్వీర్యం చేశారన్నారు. విశాఖలోని ప్రభుత్వ భవనాలు తనఖాపెట్టి, కర్నూలు జిల్లాకు హైకోర్టు బెంచ్ రాకుండా చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.11వేల కోట్లు సాయం చేయడంతో పనులు జరుగుతున్నాయన్నారు. వాట్సాప్ ద్వారా నేరుగా అధికారుల నుంచి ప్రజలకు సులువుగా పనులు సాగే విధంగా 161 సేవలతో నూతన ఒరవడికి సీఎం శ్రీకారం చుట్టారన్నారు.

కార్యక్రమంలో సీనియర్ నాయకులు పి.వి.వి.గోపాలరాజు, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాములోరి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని రామస్వామివారి దేవస్థానంలో శ్రీభాష్యం జగన్నాథాచార్యులు శత జయంతిని పురస్కరించుకుని ఆయన కుమారులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ద్రవ్య ప్రబంధ సేవా కాలములు, రామాయణ పారాయణ, భాగవతం, భగవద్గీత, స్తోత్ర పారాయణ నిర్వహించారు. అలాగే శ్రీరామచంద్రస్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహించారు. టి.పి.శ్రీనివాస రామానుజాచార్యులుతో రామాయణంపై ప్రవచనం చేశారు.

●రేగిడి: మండలంలోని సంకిలిలో శుక్రవారం సీతారామాలయం పునర్నిర్మాణ పనులకు గ్రామస్థులు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా అలయంలో సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాటిని సమీపంలోని షిర్డీసాయి మందిరానికి తరలించారు. ఆలయ పంతులు సీతారామస్వామి, ఆలయకమిటీ పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు.

●గుర్ల: మండలంలోని జగన్నాథపురం సమీపంలోని సాయిసుందర నందనవనంలో శుక్రవారం శ్రీరాముడికి పట్టాభిషేకం, శ్రీరామ నామజపం ఘనంగా నిర్వహించారు. పదిరోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.

మద్దువలసలో చేపల వేట నిషేధం

వంగర, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మద్దువలస రిజర్వాయర్‌లో చేపల వేట నిషేధంలో ఉందని ఎఫ్‌డీవో సీవీవీ ప్రసాద్ అన్నారు. నిబంధనలు అతిక్రమించి వేట సాగిస్తే జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'నిర్వాసితులకు అగచాట్లు.. స్థానికేతరులకు కాసులు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ అంబేడ్కర్ స్పందించారు. మద్దువలస రిజర్వాయర్‌లో చేపల వేటపై వివరాలు పూర్తిస్థాయిలో అందించాలని మత్స్యశాఖ డీడీ నిర్మలకుమారిని కోరడంతో ఆమె దర్యాప్తునకు ఆదేశించారు. దీంతో శుక్రవారం ఎఫ్‌డీవో.. మగ్గూరు, వంగర, మద్దువలస గ్రామాల్లో మద్దువలస మత్స్యకారులు కాకుండా గుడారాలు వేసి చేపల వేట సాగించిన వారి వివరాలు సేకరించారు. ఎక్కువ మంది కొల్లేరు ప్రాంతానికి చెందిన వారుగా గుర్తించి వారిని హెచ్చరించారు. చేపలు వేట బయట ప్రాంతాలకు సాగించరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

సస్యరక్షణపై దృష్టి సారించండి

మెరకముడిదాం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సస్యరక్షణ చర్యలపై మామిడి రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఉద్యాన అధికారి జమదగ్ని సూచించారు. మండలంలోని సాతంవలసలో శుక్రవారం మామిడి సస్యరక్షణపై రైతులకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. మామిడి రైతులకు పంట సమయంలో తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు.

ఎమ్మెల్యేని కలిసిన గంద్రేటి

శృంగవరపుకోట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని నాయీ బ్రహ్మణ బోర్డు డైరెక్టర్ గంద్రేటి సత్యన్నారాయణ, నియోజకవర్గ నాయకుడు కోడూరు శ్రీనివాసరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే పుణ్యగిరి పాలకమండలిలో నాయీ బ్రహ్మణ యువకుడికి బోర్డు డైరెక్టర్‌గా అవకాశం కల్పించాలని కోరారు.

ఆటోతో ట్రాఫిక్‌కు అంతరాయం



నిలిచిన వాహనాలు

రాజాం రూరల్, జనవరి 31, (ఆంధ్రజ్యోతి): రాజాం పట్టణంలో ఆటోలతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శుక్రవారం పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఎదుట ఓ ఆటోను రోడ్డు మీదే నిలిపి సదరు డ్రైవర్ బ్యాంకులోకి వెళ్లాడు. దాంతో సుమారు అరగంట ట్రాఫిక్ నిలిచిపోయింది.అరగంట తర్వాత గానీ అక్కడ ట్రాఫిక్ చక్కబడలేదు.

విపత్తుల్లో సహాయక చర్యలపై అవగాహన

నెల్లిమర్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విపత్తుల్లో సహాయక చర్యలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని చింతలవలస ఏపీఎస్పీ ఐదో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ లక్ష్మీనారాయణ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ ద్వారా సహాయక చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్ సర్వీస్ జిల్లా అడిషనల్ ఫైర్ అధికారి వి.సోమేశ్వరరావు, తహసీల్దార్ బి.సుదర్శనరావు, ఏఎస్‌ఐ ఎ.సతీష్, హెచ్‌ఎం ఆనందమూర్తి, బాలికోన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కుసుమలత పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై నుంచి జారిపడి వ్యక్తి మృతి

మెరకముడిదాం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మెరకముడిదాం గ్రామానికి చెందిన బాలి గౌరినాయుడు (50) అనే వ్యక్తి శుక్రవారం ట్రాక్టర్‌పై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గౌరినాయుడు వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగానే శుక్రవారం ఉదయం పనికి వెళ్లగా మెరకముడిదాం, సోమలింగాపురం గ్రామాల మధ్య పొలంలో ట్రాక్టర్‌పై వరిగడ్డి ఎక్కిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. తోటి కూలీలు, రైతులు వైద్యుడికి చూపించారు. అప్పటికే గౌరినాయుడు మృతి చెందాడు. మృతుడికి గౌరినాయుడుకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ లోకేశ్‌కుమార్ ఘటన స్థలం పరిశీలించి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మఅత చీపురుపల్లి సీహెచ్‌సీకి తరలించారు.

మద్యం మత్తులో జారి పడి..

పాచిపెంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో జారిపడి గాయాల పాలైన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పాచిపెంట మండలం పాంచాలి గ్రామానికి చెందిన పత్తికాయల రాంబాబు(36) సంక్రాంతి పండగ నుంచి మద్యానికి బానిసయ్యాడు. జనవరి 27వ తేదీన మద్యం మత్తులో జారిపడ్డాడు. తలకు తీవ్రమైన గాయం కావడంతో వెంటనే సాలూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి విజయనగరం, విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ జనవరి 30వ తేదీన తలకు చికిత్స చేశారు. అదే రోజు రాత్రి మృతి చెందాడు. భార్య బంగారమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ సమర్పణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

చెరువులో పడి..

గరివిడి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదుళ్లవలస లో ముల్లు సూర్యనారాయణ (64) శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లి చెరువులో జారిపడి మృతి చెందాడు. భార్య ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గరివిడి ఎస్‌ఐ లోకేశ్వరరావు కేసు నమోదు చేశారు.

గంజాయితో ఇద్దరు వ్యక్తుల అరెస్టు

కొత్తవలస, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శుక్రవారం గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను సీఐ షణ్ముఖరావు అరెస్టు చేశారు. వారి నుంచి 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి సీఐ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం మధ్యాహ్నం ఎస్‌ఐ సుదర్శనరావుకు వచ్చిన సమాచారం మేరకు ఆర్టీసీ కాంప్లెక్సుకు సిబ్బంది వెళ్లారన్నారు. ఇద్దరు వ్యక్తులు బ్యాగ్‌లు పట్టుకుని పారిపోవడానికి ప్రయత్నం చేయగా వారిని పట్టుకున్నారన్నారు. వారి బ్యాగ్‌ల్లో తనిఖీ చేయగా రెండు కేజీలు చొప్పున గంజాయి ఉందన్నారు. వారిని తిరుపతికి చెందిన అరవ ప్రవీణ్, కడపకు చెందిన కావడి మధుసూదన్‌గా గుర్తించామన్నారు. ఇద్దరూ స్నేహితులని, తిరుపతి నుంచి ఒడిశా రాష్ట్రం పాడువ గ్రామానికి వెళ్లి అక్కడ గుర్తుతెలియని వ్యక్తి వద్ద నుంచి 10 వేల రూపాయలకు నాలుగు కేజీల కొనుగోలు చేసినట్టు తెలిపారన్నారు. అరుకు నుంచి బస్సులో వచ్చి విశాఖ వెళ్లి అక్కడ నుంచి తిరుపతి వెళ్లడానికి ప్రయత్నం చేస్తుండగా పట్టుకున్నామన్నారు. స్థానిక తహసీల్దార్ బి.నీలకంఠరావు సమక్షంలో గంజాయిని స్వాధీనం చేసుకుని కొత్తవలస కోర్టులో హాజరపర్చినట్టు తెలిపారు.

ఐదుగురిపై అట్రాసిటీ కేసు

జామి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుకొమ్ములో ఐదుగురు విశ్వబ్రహ్మణులపై గ్రామానికి చెంది కంచుబారికి చిన్నారావు కేసు పెట్టడంతో వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరజనార్దన్ తెలిపారు. గ్రామంలోని భూవివాదంలో ఇరువర్గాల వాదులాటలో తమను విశ్వబ్రహ్మణులు కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేశారన్నారు. తమపై ఎస్సీ కులస్థులు దాడి చేశారని విశ్వబ్రహ్మణులు ఫిర్యాదు చేశారని అందులో కొందరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

అప్పలనాయుడు సేవలు స్ఫూర్తిదాయకం



నివాళి అర్పిస్తున్న జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం దాసన్నపేట జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కనకల అప్పలనాయుడు దశదిన కర్మను నగరంలోని బలిజివీధిలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరై అప్పలయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్ బ్యాంక్ డైరక్టర్‌గా, ఉపాధ్యాయుడిగా కనకల అప్పలనాయుడు సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో శిష్టకరణ సంఘం జిల్లా అధ్యక్షులు ఎంపీజీ ఈశ్వరావుతో పాటు పలువురు రాజకీయ నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, అభిమానులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయండి

కొత్తవలస, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలని జిల్లా పాల రైతు సంఘం అధ్యక్షుడు గొంపకృష్ణ మూర్తి ఆర్డీవో కార్యాలయ అధికారి హరికిరణ్‌ను కోరారు. విశాఖ నుంచి బొడ్డవర వరకు కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఎన్‌హెచ్-516కు సంబంధించి భూసేకరణ చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం వీరభద్రపురం సచివాలయానికి వచ్చిన హరికిరణ్‌ను వీరభద్రపురం, నిమ్మలపాలెం, నరపా, రాయపురాజుపేట రైతులు కలిశారు. భూసేకరణతో మరోసారి రైతులు నష్టపోతున్నారని కృష్ణ మూర్తి వివరించారు. అందరికీ ఒకే ప్రాతిపదికన చదరపు గజాలలోనే నష్ట పరిహారం చెల్లించాలని దరఖాస్తు అందజేశారు.

'గురుదేవ'ను సందర్శించిన అంధుల క్రికెట్ జట్టు



క్రికెట్ జట్టు సభ్యులతో జగదీశ్‌బాబు

కొత్తవలస, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భారత్ అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్, అర్జున అవార్డు గ్రహీత అజయ్‌రెడ్డితో పాటు జట్టు సభ్యులు శుక్రవారం మండంలోని మంగళపాలెంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టును సందర్శించారు. ఈసందర్భంగా అర్జున్ అవార్డు గ్రహీత అజయ్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ట్రస్టును ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్న ట్రస్టు చైర్మన్ జగదీశ్‌బాబును అభినందించారు. కృత్రిమ అవయవాలు పంపిణీతో పాటు నెలవారీ పింఛన్లు, నిత్యావసరాలను అందిస్తుండటాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా క్రికెట్ జట్టు సభ్యులను ఆయన పరిచయం చేశారు. ఈసందర్భంగా జట్టు సభ్యులను ట్రస్టు తరపున జగదీశ్‌బాబు సత్కరించారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



పూజల్లో ఎమ్మెల్సీ రఘురాజు

లక్కవరపుకోట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఎల్.కోటలో గల వాసవీమాత ఆలయంలో శుక్రవారం ఎమ్మెల్యే లలితకుమారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వం వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవంగా అధికారిక ప్రకటన చేయడంతో పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను వైశ్య సంఘం ఘనంగా సత్కరించారు.

●శృంగవరపుకోట రూరల్/జామి: వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జామిలోని వాసవీమాత ఆలయంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎస్.కోట మండలం ధర్మవరంలోని వాసవీమాత ఆలయంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పూజలు నిర్వహించారు.

●గరివిడి: వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినం సందర్భంగా గరివిడి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న వైశ్య సంఘ నాయకులు

క్రైం న్యూస్

డిగ్రీ విద్యార్థినిపై దాడి

●వసతిగృహం వద్ద అపస్మారకస్థితిలో..
●ముఖం, చేయిపై కమిలిన గాయాలు
● శ్రీకాకుళంలో ఘటన
● కలెక్టర్, ఎస్పీతో మాట్లాడిన మంత్రి అచ్చెన్నాయుడు



చికిత్స పొందుతున్న లక్ష్మి



ఘటనపై ఆరా తీస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

శ్రీకాకుళం క్రైం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఓ బీఎస్సీ విద్యార్థినిపై దాడి ఘటన కలకలం రేపింది. కొద్దిరోజుల కిందట జరిగిన ఓ వివాహిత హత్య ఉదంతం మరువక ముందే ఈ ఘటన చోటుచేసుకోవడంతో నగర వాసులు ఉలిక్కిపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. సంతకవిటి మండలం కొండగూడెం గ్రామానికి చెందిన కొరికాన లక్ష్మి.. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఫైనలియర్ చదువుతోంది. 2022లో కళాశాలలో చేరిన ఆ యువతి.. ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహం-3లో ఉంటోంది. ఫైనలియర్‌లో ఇంటర్న్‌షిప్‌నకు ఎంపికైంది. దీంతో కళాశాలకు వెళ్లకుండా నేరుగా ఎల్‌బీఎస్ కాలనీలోని మష్రూమ్ తయారీ కేంద్రంలో శిక్షణ తీసుకుంటూ వసతిగృహంలో ఉంటోంది. గురువారం శిక్షణ లేకపోవడంతో ఉదయమంతా వసతిగృహంలోనే ఉంది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో రికార్డుల కోసం అని చెప్పి బయటకు వెళ్లింది. రాత్రి 8-20 గంటల సమయంలో ఒంటిపై గాయాలతో వసతిగృహానికి సమీపాన పడి ఉండడం తోటి విద్యార్థినులకు కనిపించింది. వారు వెంటనే వసతిగృహం వార్డెన్‌కు సమాచారం అందించగా రాత్రి 9గంటల సమయంలో చికిత్స నిమిత్తం యువతిని జీజీహెచ్ (రిమ్స్)లో చేర్పించారు. మూర్ఛతో ఆమె పడిపోయి ఉంటుందని భావించి తల్లిదండ్రులకు రాత్రి సమాచారం అందించారు. తల్లిదండ్రులు హుటాహుటిన రిమ్స్‌కు చేరుకున్నారు. వారికి వార్డెన్ పూర్ణ జరిగిన విషయాన్ని వివరించారు. వారు యువతి కన్ను, మోచేయి, గెడ్డం మీద కమిలిన గాయాలు చూసి ఆందోళన చెందారు. తమ కుమార్తెపై ఎవరో దాడి చేశారంటూ.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కూడా దాడి ఘటనగానే అనుమానిస్తున్నారు.

● **అనుమానాలెన్నో..?**

వసతిగృహం నుంచి గురువారం మధ్యాహ్నం బయటకు వెళ్లిన లక్ష్మి.. సాయంత్రం 6.30 గంటల సమయంలో జ్యోతి అనే విద్యార్థినికి ఫోన్ చేసి బ్యూటీపార్లర్‌కు వస్తావా?...అని అడిగింది. తాను రానని చెప్పడంతో ఫోన్ పెట్టేసింది. మళ్లీ 7.30 గంటలకు వసతిగృహంలో మరో విద్యార్థికి ఫోన్ చేసి.. తాను భోజనానికి వస్తున్నానని చెప్పింది. రాత్రి 8 గంటలైనా లక్ష్మి రాలేదు. ఫోన్ చేసినా స్పందించలేదు. అదే సమయంలో కొంతమంది విద్యార్థులు వస్తుండగా.. కళాశాల నుంచి వసతిగృహానికి వచ్చే మార్గంలో.. వాటర్ ట్యాంకు ఏర్పాటు చేసిన ఇరుకు సందులో లక్ష్మి అచేతనంగా పడి ఉండడాన్ని గమనించారు. అక్కడ వాటర్ బాటిల్, లక్ష్మి చెప్పులు, బ్యాగు పడి ఉండడంతో ఏదైనా గొడవ జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. శుక్రవారం కలెక్టర్‌తో పాటు, శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, సీఐ పైడపునాయుడు, ఎస్‌ఐ హరికృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న లక్ష్మిని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం పరామర్శించారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించేందుకు విశాఖపట్నంలోని మెడికవర్‌కు తరలించారు. దర్యాప్తు ముమ్మరం చేయాలని పోలీసులను కలెక్టర్ ఆదేశించారు. వసతిగృహంలో విద్యార్థులకు రక్షణ కల్పిస్తున్న తీరుపై కలెక్టర్ మండిపడ్డారు. కాగా కళాశాల క్యాంటీన్‌లో గల సీసీ కెమెరాల్లో లక్ష్మికి సంబంధించి కొన్ని దృశ్యాలు రికార్డు అయ్యాయి. రాత్రి 7-30 సమయంలో ఆ యువతి సమీపంలో ఓ యువకుడు వెళ్తున్నట్లు సీసీ కెమెరాలో కనిపించింది. దీంతో ఆ యువకుడే దాడి చేశాడా? అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ప్రస్తుతం ఆ యువతి మాట్లాడలేని స్థితిలో ఉంది. సైగలు మాత్రమే చేస్తోంది.

● **నిందితులను అరెస్టు చేయాలి: మంత్రి అచ్చెన్నాయుడు**

దాడి ఘటనపై వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థినిపై దాడి ఘటనకు కారణమైన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని ఆదేశించారు. వసతి గృహం, కళాశాల సమీపంలో రక్షణ చర్యలు లేకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు.

పోస్టుమార్టం నిర్వహణకు వైద్యుల నిరాకరణ

● ప్రభుత్వాసుపత్రి వద్ద బాధితుల నిరసన ● స్పందించిన డీసీహెచ్ఎస్

చీపురుపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఓ వ్యక్తి మృత దేహానికి వైద్యులు పోస్టు మార్టం చేయడానికి నిరాకరించడంతో చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మృతుడి బంధువులు శుక్రవారం సాయంత్రం నిరసనకు దిగారు. మృతుని బంధువుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మెరకముడిదాం మండల కేంద్రానికి ఓ ట్రాక్టర్ డ్రైవర్ శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అప్పటికి విధుల్లో ఉన్న డా.తిరుపతిరావు పోస్టుమార్టం చేయడానికి నిరాకరించారు. దీంతో మృతుని తరఫున బంధువులు ఆ సమాచారాన్ని జడ్పీ చైర్మెన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. ఆయన వెంటనే స్పందించి పోస్టుమార్టం చేయడానికి వైద్యులు నిరాకరించిన విషయాన్ని డీసీహెచ్ఎస్ పద్మజకు ఫిర్యాదు చేశారు. దాంతో ఆమె చీపురుపల్లి చేరుకుని వేరే వైద్యుడితో పోస్టుమార్టం పూర్తి చేయించడంతో మృతుని బంధువులు శాంతించారు. ఈ సందర్భంగా డీసీహెచ్ఎస్ పద్మజ మాట్లాడుతూ మృతదేహం ఆసుపత్రికి చేరినప్పటికీ అందుకు సంబంధించిన పత్రాలు అందకపోవడంతో వైద్యుడు పోస్టు మార్టం చేయలేకపోయారన్నారు.

సర్వేయర్ ఆత్మహత్య

నరసన్నపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా వంగరలో సర్వేయర్‌గా పనిచేస్తున్న ఎడిళ్ల అప్పల నర్సింహులు అలియాస్ సింహాచలం (53) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలో మారుతీనగర్-3లో సింహాచలం కుటుంబంతో కలిసి ఉంటున్నారు. శుక్రవారం ఇంట్లో తలుపులు వేసుకొని బెడ్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నారు. భార్య బనిశెట్టి సద్గుణాంబ స్కూల్ నుంచి ఇంటికి వచ్చే సరికి భర్త ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉండడంతో స్థానికుల సాయంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందారు. సింహాచలం భార్య కోటబొమ్మాళి మండలం లఖిందిడ్డ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే సింహాచలం ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

చికిత్స పొందుతూ కలాసి మృతి

రేగిడి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండంలో వండానిపేట గ్రామానకి చెందిన నారు జనార్దననాయుడు ప్రైవేట్ కార్మాగారంలో కలాసిగా పనిచేస్తూ ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. ఈయన విశాఖపట్నం అనుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. కుటుంబీకుల వివరాల ప్రకారం రెడ్డిపేట గ్రామంలో జూట్ పరిశ్రమలో కలాసిగా పనిచేస్తున్న జనార్దననాయుడు ఈనెల 22న ఫ్యాక్టరీలో విధులకు హాజరై జూట్‌బేల్‌లు అన్‌లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. గాయపడిన ఆయన్ని ముందుగా రాజాం అసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో అదేరోజు శ్రీకాకుళం మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి ఈనెల 23న విశాఖపట్నం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థతి విషమించి శుక్రవారం సాయింత్రం మృత్యువాతపోరాడి తుదిశ్వాస విడిచాడు. ఈయనకు భార్య వరలక్ష్మి, కుమార్తె లావణ్య, కుమారుడు వైకుంఠరావు ఉన్నారు. లేబర్‌గా పనిచేస్తు కుటుంబాన్ని పోషిస్తున్న ఇంటి పెద్ద మృత్యువాతపడటంపై కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు

పులి దుంపలు తిని ఉపాధి కూలీల అస్వస్థత

కురుపాం/రూరల్, జనవరి31 (ఆంధ్రజ్యోతి): అడవిలో దొరికే పులి దుంపలు తిని ఉపాధిహామీ కూలీలు అస్వస్థకు గూరైన ఘటన కురుపాం మండలం రస్తాకుంటుబాయి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. రస్తాకుంటుబాయికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఆరిక మాధవరావు, ఆరిక చరణ్, ఆరిక ప్రవీణ్ ముగ్గురు ముపకులు ఉపాధి హామీ పనులకు వెళ్లారు. అక్కడ దొరికిన పులి దుంపలు కాల్చుకుని తిని అస్వస్థకు గురయ్యారు. స్థానికులు వెంటనే వారికి కురుపాం సీహెచ్‌సీకి తరలించగా వైద్యులు చికిత్స నిర్వహించారు. వీరి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉంది.

నామమాత్రంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

బొబ్బిలి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక బొబ్బిలి మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం నామ మాత్రంగా సాగింది. ఈ సమావేశానికి మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకటమురళీ కృష్ణారావు అధ్యక్షతన వహించారు. కమిషనర్ రామలక్ష్మి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి రాజకీయపరమైన అంశాలను చర్చించరాదని, అజెండాలోని అంశాలను నిబంధనల ప్రకారం ముట్టుకోరాదని తెలిపారు. ఛైర్మన్ వెంటనే తన టేబుల్‌పై గల బెల్‌ను మోగించి సమావేశాన్ని వాయిదా వేసినట్లు సంకేతాలిచ్చారు. కౌన్సిలర్లకు గౌరవ భృతి అందాలనే ఉద్దేశంతో నిబంధనల ప్రకారం ఈ సమావేశం నిర్వహించినట్టు ఛైర్మన్ తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు పాఠశాల పరిశీలన


గొల్లపల్లి పాఠశాలను పరిశీలిస్తున్న ఆర్డీవో, డీఎస్పీ

బొబ్బిలి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం గొల్లపల్లిలో శ్రీవేణుగోపాల మున్సిపల్ ఉన్నత పాఠశాలను అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు, డీఎస్పీ జి.భవ్యారెడ్డి, సీఐ కటకం సతీష్‌కుమార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ బలివాడ గౌరీశంకర్ పాఠశాలలోగల సౌకర్యాలు, వసతిని పరిశీలించారు. గతంలో ఇక్కడ నిర్వహించిన ఎన్నికల తీరును సిబ్బంది వివరించారు. ఎన్నికల నిర్వహణ కోసం ఈ కేంద్రానికి ఇంకా ఏం అవసరం ఉంటుందో గుర్తించి నివేదిస్తామని అధికారులు తెలిపారు.

మస్తరు కార్యాలయం తనిఖీ

బొబ్బిలి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోవెల సెంటరులో గల పారిశుధ్య కార్మికుల మస్తరు కార్యాలయాన్ని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి శుక్రవారం ఉదయం తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికుల హాజరును పరిశీలించారు. అనంతరం సచివాలయాల పారిశుధ్య కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్స్ ఫీజులు బకాయిలు లేకుండా పూర్తిగా వసూలు చేయాలని ఆదేశించారు. మెయిన్‌రోడ్డులో ఎక్కడా ఎటువంటి చెత్తాచెదారాలు కనిపించరాదన్నారు. మార్కెట్ ఏరియాలో పైపులైన్ మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని ఏఈ గుప్తాను ఆదేశించారు. మార్కెట్‌లో ఎల్లప్పుడూ రద్దీగా ఉండే అవకాశం ఉన్నందున, ఉదయం 7 గంటల లోపే పారిశుధ్య పనులను పూర్తి చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టరును, పబ్లిక్‌హెల్త్ మేస్త్రీలను ఆదేశించారు. కంచర వీధిలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.

20వ వార్డులో వాట్సాప్ సేవలు

బొబ్బిలి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 20వ వార్డులో వాట్సాప్ సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నామని ఆ వార్డు కౌన్సిలర్ సాలా స్వప్నదేవి, టీడీపీ అధికార ప్రతినిధి సాలా రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత నారా లోకేశ్‌లు అందిస్తున్న స్ఫూర్తితో ఈ సేవలను అందజేస్తున్నామని చెప్పారు. 9491666665 వాట్సాప్ నెంబరు నుంచి తమ సేవలను అందుకోవచ్చని వారు తెలిపారు.

భూముల కబ్జాను అడ్డుకోండి

బొబ్బిలి రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ పరిధిలో గల పలు ప్రభుత్వ చెరువులు, ఖాళీ స్థలాలను కొంతమంది వ్యక్తులు కబ్జా చేస్తున్నారని, క్రిమినల్ కేసులు నమోదు చేసి వాటిని కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో హెచ్‌డీటీవో టీకేవీఎస్ సుబ్బారావుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో గల శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు, భూముల్లో 2 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని దీనిపై గతంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి దర్యాప్తు చేయకపోవడం వల్ల ఆ భూమి ఆక్రమణకు గురైందని చెప్పారు. అలాగే ఐటీఐ కాలనీ ప్రభుత్వ పాఠశాల పక్కన ఉన్న కొంత ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని, దీనిపై తక్షణమే రెవెన్యూ యంత్రాంగం స్పందించి స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు. ఇందిరమ్మ కాలనీ కూడా భూ కబ్జాలకు అడ్డాగా మారిపోయిందన్నారు. పక్కా ఆధారాలతో రెవెన్యూ యంత్రాంగానికి తెలియజేసినప్పటికీ తహసీల్దార్ మౌనం వహించడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, నాయకులు పాలూరి కృష్ణ, బి.తులసి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

బాడంగి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు కోరారు. కోడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఆయన విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. గంజాయి తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులు అవగాహన కల్పించుకోవాలన్నారు. పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశాలు ఏర్పాటు చేయొద్దు

రామభద్రపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో తప్పనిసరిగా కోడ్ అమలు చేయాలని తహసీల్దార్ ఆకుల సులోచనారాణి సూచించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిందని, ఎటువంటి సభలు, సమావేశాలు ఏర్పాటు చేయవద్దని సూచించారు. మండలంలో 78 మంది ఓటర్లు ఉన్నారని, వీరికి మండల కేంద్రంలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రత్నం, ఎస్ఐ వెలమల ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

181 జీవోపై హర్షం

రామభద్రపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని గుర్తించి ప్రభుత్వం 181 జీవో విడుదల చేయడం ఆనందదాయకమని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పొట్టా రామారావు, యువజన సంఘం అధ్యక్షుడు నడిపల్లి అన్నాజీరావు అన్నారు. మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆ సంఘ నాయకులు, సభ్యులు.. 181 జీవో విడుదలపై హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పోలమ్మతల్లి ఆలయం ప్రారంభం

బాడంగి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): బాడంగిలో పోలమ్మతల్లి ఆలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. టీడీపీ ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీను, సర్పంచ్ కండి రమేష్, వైస్ ఎంపీపీ మరడాన గాంధీ, జడ్పీటీసీ రామారావు పాల్గొన్నారు.

పాడైన సీలింగ్.. ఊడిన ఫ్లోరింగ్

● అధ్వానంగా బొబ్బిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశపు గది

బొబ్బిలి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశపు హాలులో సీలింగ్ పూర్తిగా పాడైపోయింది. ఫ్లోరింగ్‌లో పలు చోట్ల టైల్స్ ఊడిపోయాయి. కార్యాలయం నిర్వహణ, మరమ్మతుల కోసం తరచూ నిధులు ఖర్చు చేస్తున్నప్పటికీ సమావేశపు గదిని ఇలా ఉంచడం సరికాదని టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు అన్నారు. అధికారులు తక్షణం స్పందించి ఈ గదిని సుందరంగా తీర్చిదిద్దాలని ఆయన డిమాండ్ చేశారు.


ఇదీ సమావేశపు గదిలో సీలింగ్ పరిస్థితి


ఊడిన టైల్స్

ఉపాధి కార్యాలయానికి తాళం

● అధికారులు అన్యాయం చేస్తున్నారని సిబ్బంది నిరసన


ఉపాధి కార్యాలయానికి తాళం వేస్తున్న సిబ్బంది

సీతంపేట రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో ఉన్న ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయానికి టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు శుక్రవారం తాళం వేసి, నిరసన తెలిపారు. కార్యాలయం వెలుపల బైఠాయించి అధికారులు తమకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో జిల్లా మొత్తం మీద 100రోజుల ఉపాధి పనిదినాలు ఎక్కువగా కల్పించిన ఘనత సీతంపేటకే దక్కిందన్నారు. తాము ఇంతగా కష్టపడుతున్నా తమ పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అన్ని మండలాల్లో ఈ ఏడాది ఉపాధి సిబ్బందికి జనవరి నెల జీతాలకు సంబంధించి శ్లాట్‌లు అప్‌లోడ్ చేశారని, కానీ సీతంపేట మండలంలో మాత్రం చేయలేదని వారు ఆరోపించారు. ఎంపీడీవో తమ పట్ల చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ● ఈ నిరసనపై ఎంపీడీవో కె.గీతాంజలిని వివరణ కోరగా సిబ్బందితో మాట్లాడి సమస్య పరిష్కరించామని చెప్పారు. ఇది చిన్న సమస్యేనని సమాధానమిచ్చారు.

డీవీఎంసీ సభ్యుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా విజిలెన్స్, పర్యవేక్షణ కమిటీ (డీవీఎంసీ) గౌరవ సభ్యుల నియామకానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్టు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారిత అధికారి ఎండీ గయాజుద్దీన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. షెడ్యూల్డ్ కులాల, తెగల పీసీఆర్, పీవోఏ చట్టం కింద జిల్లా విజిలెన్స్, పర్యవేక్షణ కమిటీలో గౌరవ సభ్యులుగా నియామకం చేపడుతున్నట్టు చెప్పారు. ఆసక్తి ఉన్న షెడ్యూల్డ్ కులాలు/తెగల సోషల్ వర్కర్స్ నుంచి, షెడ్యూల్డ్ కులాలు/తెగల గ్రూప్-ఏ గెజిటెడ్ అధికారులు నుంచి దరఖాస్తులను కోరుతున్నట్టు ఆయన తెలిపారు. షెడ్యూల్డ్ కులాలు/షెడ్యూల్డ్ తెగలకు చెందిన గ్రూప్-ఎ గజిటెడ్ అధికారులు అధికారక సభ్యులుగా ఇద్దరిని నియమించినట్టు చెప్పారు. అలాగే షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన ముగ్గురిని అనధికార సభ్యులుగా తీసుకోనున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తదుపరి వివరాల కోసం పూర్తి దరఖాస్తుతో జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సాధికారిత శాఖ/మెంబర్ కన్వీనర్, ఆర్‌సీఎం స్కూల్ బిల్డింగ్, ఎఫ్ఐ ఫ్లోర్‌లో ఉన్న కార్యాలయాన్ని నేరుగా సంప్రదించవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు 94925 35085 నెంబర్‌కు సంప్రదించాలని ఆయన చెప్పారు.

హామీలు నెరవేర్చేదెప్పుడు?


మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకుడు యుగంధర్

బొబ్బిలి జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనంలో జరుగుతున్న ఏఐవైఎఫ్ మహాసభలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలను ఎప్పటికి అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. నిరుద్యోగ భృతిపై యువతకు ఇంతవరకు ఎటువంటి భరోసా లేదని, తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీ ఫైల్‌కు కదలిక లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి బీసపు సాయికిరణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మలుపుల వద్ద జాగ్రత్తలు పాటించాలి

కొమరాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రహదారుల్లో ప్రమాదకర మలుపుల వద్ద జాగ్రత్తలు పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి ఎ.వరప్రసాద్ వాహనదారులకు సూచించారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆయన కూనేరు - రామభద్రపురం రహదారిలో గల ప్రమాదకర మలుపుల వద్ద సహాయ ఇందన శకట తనిఖీదారులు, పోలీసులతో కలిసి తనిఖీ నిర్వహించారు. వాహనదారులకు అవగాహన కల్పించారు. అలాగే కురుపాం మండలం తోటపల్లి - గుణానుపురం రహదారిలో గల ప్రమాదకర మలుపుల వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ ఇంధన శకట తనిఖీదారు జి.సత్యనారాయణ, ఆయా మండలాల ఎస్ఐలు పాల్గొన్నారు.

నిన్న పదోన్నతి.. నేడు ఉద్యోగ విరమణ


నాగేశ్వరిని సత్కరిస్తున్న దృశ్యం

బెలగాం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఏఎస్పీగా పదోన్నతి పొంది బదిలీపై జిల్లాకు వచ్చి గురువారం బాధ్యతలు స్వీకరించిన ఎల్.నాగేశ్వరి.. శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఏఎస్పీగా పదవీ విరమణ చేసిన నాగేశ్వరిని పార్వతీపురంలో పోలీస్ సిబ్బంది సత్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను చిన్నప్పుడు చదువుకున్న ప్రాంతంలో నే పదవీ విరమణ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. 36 ఏళ్ల సర్వీస్‌లో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నానని చెప్పారు. పాలకొండ డీఎస్పీ రాంబాబు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కళకళ


శుక్రవారం రాత్రి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కనిపిస్తున్న జనం

బెలగాం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫిబ్రవరి 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు అమలు లోకి రానున్నందున శుక్రవారం పార్వతీపురం లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కళకళలాడింది. రిజిస్ట్రేషన్ విలువ స్వల్పంగా పెరగడంతో సవరించిన చార్జీలు అమలులోకి రాక ముందే ఉన్న ధరలకే లావాదేవీలు పూర్తి చేసేందుకు ప్రజలు హడావుడి చేశారు. రిజిస్ట్రేషన్లు ఒక్కసారిగా పెరగడం వల్ల సర్వర్లు మందగించడంతో ప్రాసెసింగ్‌లో జాప్యం జరిగింది. ఉదయం వచ్చిన వ్యక్తులు రాత్రి వరకు వేచి ఉండాల్సి వచ్చింది. ముందుగా టోకెన్ చేయించుకున్న వారు మరుసటి రోజు కూడా వచ్చే అవకాశం ఉంది.

నిర్మలమ్మ కరుణించేనా?

(మూడో పేజీ తరువాయి)

ప్రభుత్వం రాయితీలను భరించేందుకు అవసరమయ్యే నిధులను ఈ బడ్జెట్‌లో కేటాయిస్తారని భావిస్తున్నారు.

● ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) కింద జిల్లాలోని గిరిజన గ్రామాల్లో 9 రోడ్లు (73.54 కిలోమీటర్లు) నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గతేడాది సుమారు రూ.50.1కోట్లు అందించింది. ఇంతవరకు రూ.1.34 కోట్లతో రెండు కిలోమీటర్ల మేర రోడ్లు పూర్తిచేశారు. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం-జనమన్) పథకం కింద జిల్లాలో 15.60 కిలోమీటర్లు కలిగిన మూడు రోడ్లకు రూ.16.30 కోట్లు మంజూరయ్యాయి. గత అక్టోబరులో టెండర్ ప్రక్రియ పూర్తయింది. పనులు జరగాల్సి ఉంది. ఇంకా చాలా గిరిజన గ్రామాలకు రోడ్లు లేవు. గర్భిణులు, బాలింతలు, అనారోగ్యానికి గురైన వారిని వైద్యం నిమిత్తం డోలీలతో కొండ కిందకు దించాల్సి వస్తుంది. కొండపైనున్న గిరిజన గ్రామాలన్నిటికీ రోడ్లు వేసేందుకు ఈ బడ్జెట్‌లో కేటాయిస్తారని గిరిజనులు ఎదురు చూస్తున్నారు. ● కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ కింద ప్రతి వ్యక్తికీ 50లీటర్ల సురక్షిత తాగునీరు అందించేందుకు ఇంటింటి కొళాయిలను ఏర్పాటు చేస్తుంది. జిల్లాలో 2,307 పనులకు రూ.902.52 కోట్లు కేటాయించారు. 1053 పనులు పూర్తయ్యాయి. 370 పనులు జరుగుతున్నాయి. 884 పనులను ఇంకా ప్రారంభించలేదు. ఇంతవరకు రూ.118. 88 కోట్లు ఖర్చు చేశారు. రూ.5.55కోట్ల బిల్లుల పెండింగ్ ఉన్నాయి. గిరిజన ప్రాంతాల్లో 231 పనులకు రూ.34.64 కోట్లు మంజూరయ్యాయి. 115 పనులకు రూ.4.70 కోట్లు ఖర్చుచేశారు. గత వైసీపీ ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను పక్కదారి పట్టించింది. దీంతో మైదాన, గిరిజన ప్రాంతాల్లో సగం పనులే జరిగాయి. ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో ఇప్పుడు కేంద్రం అందించే నిధులపైనే జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ● ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా (పీఎం-శ్రీ) పథకం ద్వారా జిల్లాలో 34 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారు. 8 పాఠశాలల్లో కెమిస్ట్రీ ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.15.58లక్షల చొప్పున, 30 పాఠశాలల్లో ప్లే గ్రౌండ్‌లకు రూ.లక్ష చొప్పున అందించారు. అలాగే, 34 పాఠశాలల అభివృద్ధికి వార్షిక గ్రాంటు కింద రూ.33.75 లక్షలు కేటాయించారు. ఈ బడ్జెట్‌లో అన్ని పాఠశాలల్లో కెమిస్ట్రీ ల్యాబ్‌లతో పాటు ఆట స్థలాల అభివృద్ధికి నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. ● జిల్లా కేంద్ర ఆసుపత్రి ఆధునికీకరణకు రూ.500 కోట్లు, శృంగవరపుకోట, గజపతినగరం, బొబ్బిలి, భోగాపురం, నెల్లిమర్ల సీహెచ్‌సీలను ప్రాంతీయ ఆసుపత్రులుగా స్థాయిని పెంచేందుకు రూ.578.30కోట్లు నాబార్డు నిధులను గతంలో కేటాయించారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదు. అలాగే, నిధుల విడుదల్లో జాప్యం జరగడంతో ఆసుపత్రి భవన నిర్మాణాలు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ నిధుల కొరత వేధిస్తుంది. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరిగితేనే ఆస్పత్రుల భవన నిర్మాణాలు పూర్తికానున్నాయి.

ఆసుపత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోండి


కేసలికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

విజయనగరం దాసన్నపేట జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావుకు జిల్లా కేంద్రంలోని హుకుంపేటకు చెందిన మజ్జి సతీస్‌కుమార్, జ్యోతి దంపతులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న తమ కుమారుడు జస్వంత్ ఇటీవల అనారోగ్యానికి గురి కావటంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించామన్నారు. వైద్యం అందిస్తుండగా మృతి చెందాడని చెప్పారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే జస్వంత్ మృతి చెందాడని వివరించారు. ఆసుపత్రి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఛైర్మన్‌ని కోరారు. దీంతో స్పందించిన ఛైర్మన్.. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, పోలీసులు సమగ్ర విచారణ జరిపి నివేదిక అందించాలని ఆదేశించారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన


రాళ్లు తేలిన రోడ్డుపై మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న ఆతవ గ్రామస్థులు

వేపాడ జనవరి 31 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఆతవ గ్రామస్థులు తమ గ్రామానికి తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ గత ఐదు రోజులుగా రకరకాలుగా నిరసన తెలియజేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రాళ్ల తేలిన రోడ్డుపై మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. తక్షణమే తమ గ్రామానికి రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. దళిత నాయకుడు ఆతవ ఉదయభాస్కర్ సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు చల్లా జగన్, కెర్రి దేముడు, సర్పంచ్ గొంప వేమనరాము, గ్రామస్థులు పాల్గొన్నారు.

రహదారులే కల్లాలు

● పంటను ఆరబోస్తున్న వైనం

● ఇబ్బంది పడుతున్న వాహనదారులు

బొబ్బిలి రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలంలోని పలు గ్రామాల్లో రైతులు రహదారులనే కల్లాలుగా ఉపయోగిస్తున్నారు. పెసర, మొక్కజొన్న, ఉలవలు తదితర పంటలను రోడ్లపైనే ఆరబోసి, అక్కడే నూరుస్తున్నారు. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గతంలో ప్రమాదాలు సంభవించిన సందర్భాలు కూడా ఉన్నాయి. కోమటిపల్లి, కలవరాయి, జగన్నాథపురం గ్రామాల్లో శుక్రవారం ఇలా రహదారులపై అపరాల పంటను ఆరబోయడం కనిపించింది.


కలవరాయిలో రహదారిపైనే పంటను ఆరబెట్టిన దృశ్యం

సచివాలయాలు ప్రక్షాళన

(3వ పేజీ తరువాయి)

ఇద్దరు మల్టీపర్పస్ ఫంక్షనరీలు, నలుగురు టెక్నికల్ ఆస్పిరేషనల్ ఫంక్షనరీలు ఉంటారు. బి సెక్షన్‌కు సంబంధించి 2,500 నుంచి 3,000 జనాభా ఉన్న సచివాలయాలకు ముగ్గురు మల్టీపర్పస్, నలుగురు టెక్నికల్ ఫంక్షనరీలు ఉంటారు. సి సెక్షన్‌కు సంబంధించి మూడు వేలకుపైగా జనాభా ఉన్న సచివాలయాల్లో నలుగురు మల్టీపర్పస్, నలుగురు టెక్నికల్ ఫంక్షనరీలు ఉంటారు. అదే సమయంలో ప్రభుత్వం ఇటీవల డ్రోన్లతో పాటు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, జియో ట్యాగింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్న సంగతి తెలిసిందే. వాటి బాధ్యతలను సైతం అప్పగించే చాన్స్ ఉంది.

● గ్రామ సచివాలయాల్లో మల్టీపర్పస్ ఫంక్షనరీల్లో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్స్‌తో పాటు మహిళా పోలీసులు ఉంటారు. వార్డు సచివాలయానికి అడ్మిన్ కార్యదర్శి, ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి, వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్యదర్శి మహిళా సంరక్షణ కార్యదర్శి ఉంటారు.

● గ్రామ సచివాలయాల్లో టెక్నికల్ ఫంక్షనరీలకు వీఆర్వో, ఏఎన్ఎం, సర్వేయర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వ్యవసాయం, పశుసంవర్ధక ఎనర్జీ కార్యదర్శి ఉంటారు. వార్డు సచివాలయాల్లో రెవెన్యూ కార్యదర్శి, ఆరోగ్య కార్యదర్శి, ప్లానింగ్ కార్యదర్శి, ఎమినిటీస్, శానిటరీ, ఎనర్జీ కార్యదర్శులు ఉంటారు.

అందరూ మెచ్చేలా.. పిల్లలకు నచ్చేలా..

(3వ పేజీ తరువాయి)

ఉన్న యూపీ స్కూళ్లను ఉన్నత పాఠశాలలుగా మార్చాలని ప్రతిపాదించారు. ప్రతి మండలంలో మోడల్ ప్రైమరీ పాఠశాలను నెలకొల్పి నాణ్యమైన విద్యాబోధనకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఫౌండేషన్ పాఠశాలలు (1, 2 తరగతులు), బేసిక్ ఫౌండేషన్ పాఠశాలలు (1 నుంచి 5 వరకు), మోడల్ ప్రైమరీ పాఠశాలలు (55-60 మధ్య విద్యార్థులుంటే 1 నుంచి 5 తరగతులు) ఏర్పాటు చేయనున్నారు. ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులను తిరిగి వారు గతంలో చదువుకున్న పాఠశాలలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రకారం ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి పది తరగతులు మాత్రమే ఉంటాయి. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులను నియమించనున్నారు. 55 కన్నా తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఇద్దరు లేదా ముగ్గురు ఉపాధ్యాయులను నియమిస్తారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

విజయనగరం రింగ్‌రోడ్డు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వశక్తితో ఎదిగిన నాడే సాధికారికత సాధ్యమవుతుందని విజయనగరం మున్సిపల్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. శుక్రవారం కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన మెప్మా బజారును ఆయన ప్రారంభించారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు పరిశీలించారు. కార్యక్రమంలో టీపీఆర్‌వో సింహాచలం, సిటి మిషన్ మేనేజర్ సన్యాసిరావు తదితరులున్నారు.

కార్మికులకు సౌకర్యాలు మెరుగు పరచండి

రాజాం రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.జగన్మోహనరావు డిమాండ్ చేశారు. ఈమేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రాజాం మున్సిపల్ కమిషనర్ రామఅప్పలనాయుడుకి శుక్రవారం అందజేశారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, నాయకులు శ్రీను, రాజేష్, రవి, సింహాచలం, రము, శ్యామల, అప్పలరాం తదితరులు ఉన్నారు.